ప్చ్.. ఇంకా బాలారిష్టాలే

● జిల్లా ఏర్పాటై మూడున్నరేళ్లవుతున్నా సమకూరని సదుపాయాలు


కలెక్టరేట్ సహా 80 శాతం శాఖల కార్యాలయాలు ఏర్పాటైన టీటీడీ భవనం

ఒక గెజిట్ నోటిఫికేషన్‌తో గత వైసీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4 నుంచి తిరుపతి జిల్లాను ప్రకటించేసి చేతులు దులిపేసుకుంది. కలెక్టరేట్ సహా వివిధ శాఖల జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను, భవనాల నిర్మాణానికి నిధులనూ కేటాయించలేదు. జిల్లా ఏర్పాటయ్యాక రెండేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో తిరుపతి జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లవుతున్నా జిల్లా పాలన బాలారిష్టాలను దాటలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీటీడీ భవనంలో 80 శాతం కార్యాలయాలు

కలెక్టరేట్ సహా 80 శాతం కార్యాలయాలు టీటీడీ భవనంలో తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.శ్రీవారి యాత్రికుల వసతి సముదాయంగా తిరుపతి రూరల్ మండలం దామినేడు సమీపంలో టీటీడీ పద్మావతి నిలయం పేరిట భారీ భవన సముదాయం నిర్మించిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లా ఏర్పాటుతో కలెక్టరేట్‌కు ఈ భవనాన్ని తాత్కాలికంగా కేటాయించారు. నెలకు రూ.28 లక్షలు అద్దె కింద ప్రభుత్వం టీటీడీకి చెల్లించాలి. ఇందులోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, ఫారెస్ట్ సెటిల్‌మెంట్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, లీగల్ సెల్, పరిశ్రమలు, అన్ని సంక్షేమ శాఖలు, దేవదాయ, సహకార వంటి శాఖల కార్యాలయాలు వీటిలోనే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి తర్వాత టీటీడీ భవనానికి అద్దె చెల్లించేందుకూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు.

కొన్నింటికే సొంత భవనాలు

● తిరుపతి జిల్లా కాక ముందునుంచీ అర్బన్ పోలీసు జిల్లా కేంద్రంగా ఉంది. దీంతో జిల్లా పోలీసు కార్యాలయం, ఎస్పీ నివాస భవనాలు మాత్రమే ఇటీవల నిర్మాణమయ్యాయి. వాటిని ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతానికి టీటీడీ భవనంలో ఎస్పీ కార్యాలయం నడుస్తోంది.

● డీఆర్‌డీఏ, డ్వామా, అటవీ, ట్రెజరీ శాఖలకు మాత్రమే సొంత భవనాల్లో జిల్లా కార్యాలయాలున్నాయి.

● డివిజన్ స్థాయి కార్యాలయాల్లోనే ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాలను సర్దుకున్నారు. రవాణా, వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యాలయాలదీ అదే పరిస్థితి.

కలెక్టరేట్‌కు జరగని స్థల సేకరణ

● కలెక్టరేట్ భవనాలకు ఇంకా స్థల సేకరణ జరగలేదు. తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల్లో కొన్ని స్థలాలు ప్రతిపాదించినా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. దీంతో స్థల కేటాయింపు కూడా జరగలేదు.

● ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం కాబట్టి పద్మావతి నిలయాన్ని ప్రభుత్వానికి శాశ్వతంగా కేటాయించేందుకు టీటీడీ ఇదివరకే అంగీకరించింది. రూ. వంద కోట్లు టీటీడీకి చెల్లించి భవనాన్ని కొనే ప్రతిపాదన గత ప్రభుత్వం నుంచే పెండింగులో ఉంది. దీంతో కలెక్టరేట్‌కు శాశ్వత భవనాలు ఎప్పుడు సమకూరుతాయో అంచనా వేయలేని పరిస్థితి.

● ముఖ్య అధికారుల నివాస భవనాల విషయానికొస్తే.. మునుపటి కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవనాన్ని కలెక్టర్ బంగ్లాగానూ, ఆర్డీవో బంగ్లాను జేసీ బంగ్లాగా వినియోగిస్తున్నారు. డీఆర్వో, ఆర్డీవోలకు నివాస బంగ్లాలు లేవు.


శ్రీకాళహస్తిలో ఆర్డీవో కార్యాలయం నడుస్తున్న మార్కెట్ కమిటీ భవనం


ప్రైవేటు భవనంలో శ్రీకాళహస్తి డీఎస్పీ కార్యాలయం


సొసైటీ భవనంలో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం

కొత్త డివిజన్ కేంద్రాలదీ అదే తీరు

● జిల్లా పరిధిలో పాతవైన తిరుపతి, గూడూరు డివిజన్లకు సొంత భవనాలున్నాయి. కొత్తగా ఏర్పాటైన శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలకు సొంత భవనాలు లేవు.

● శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో నడుస్తోంది. భవన నిర్మాణానికీ స్థల సేకరణ కూడా జరగలేదు. ఆర్డీవో నివాసమూ అద్దె భవనంలోనే. కొత్తగా ఏర్పాటైన డీడీవో కార్యాలయమూ డీఆర్‌డీఏ భవనంలో తాత్కాలికంగా ప్రారంభమైంది. డీఎస్పీ కార్యాలయం సహా మిగతా శాఖల డివిజన్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే ఉన్నాయి.

● సింగిల్ విండో కార్యాలయ భవనంలో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. స్థల సేకరణా జరగలేదు. ఆర్డీవో నివాసమూ అద్దె భవనంలోనే. డీఎస్పీ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, కార్మిక శాఖల డివిజన్ కార్యాలయాలు నాయుడుపేటలో ఉన్నాయి. వీటిని సూళ్లూరుపేటకు తరలించే ప్రతిపాదనేదీ రాలేదు. మిగిలిన శాఖల డివిజన్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

జిల్లాల నడుమ జరగని శాఖలు, సంస్థల విభజన

ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచీ కొన్ని నియోజకవర్గాలను వేరుచేసి తిరుపతి జిల్లా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడున్నరేళ్లవుతున్నా ఇప్పటికీ కొన్ని శాఖలు, సంస్థలను విభజించలేదు.

● జిల్లాలోని 20 మండలాలు చిత్తూరు జడ్పీ పరిధి.. 14 మండలాలు నెల్లూరు జడ్పీ పరిధిలో ఉన్నాయి. తిరుపతి అర్బన్ పోను.. మిగిలిన 19 మండలాల ఎంపీడీవోల బదిలీలు, పదోన్నతులు చిత్తూరు, 14కు సంబంధించి నెల్లూరు జడ్పీ సీఈవో కార్యాలయం నియంత్రిస్తోంది.

● రెవెన్యూ శాఖకు సంబంధించి తహసీల్దార్ల బదిలీలు, పదోన్నతులు ఇటు చిత్తూరు కలెక్టర్, అటు నెల్లూరు కలెక్టర్ల పరిధిలోనే ఉన్నాయి. తిరుపతి కలెక్టర్ ప్రతిపాదనల మేరకు వారే ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ● ఎంఈవోల నియామకం, బదిలీలు, ఉపాధ్యాయ బదిలీలు, పోస్టుల భర్తీ వంటివన్నీ చిత్తూరు, నెల్లూరు డీఈవోల నియంత్రణే సాగుతోంది.

● జిల్లా సహకార కేంద్రబ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ వంటివీ చిత్తూరు, నెల్లూరు కేంద్రాలుగానే పాలన సాగిస్తున్నాయి.

● తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలకు చిత్తూరు, నెల్లూరు జిల్లాల అధికారులు హాజరు కావాల్సి వస్తోంది. అధికారిక, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ప్రొటోకాల్ కూడా రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల పాటించాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్పష్టమైన విభజన జరిగి జిల్లాలో పూర్తిస్థాయి పాలన ప్రారంభమైతే తప్ప కొత్త జిల్లా ఏర్పాటు ఉద్దేశం ఆచరణలో నెరవేరే అవకాశం లేదు.

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం10నుంచి 12గంటల వరకు వినియోగదారులు 89777 16661 నెంబరుకు ఫోనుచేసి సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 91333 31912 నెంబరుకూ చాట్‌చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లచ్చన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

● 14 కేంద్రాల్లో 2,860 మంది విద్యార్థుల హాజరు

తిరుపతి(విద్య),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షను ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. తిరుపతి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, పుత్తూరు ప్రాంతాల్లోని 14 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు 2,958 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 2,860 మంది హాజరయ్యారు. 95 మంది గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో వసతులు, భద్రతా చర్యలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు.

అపరాధం లేకుండా 9 వరకు టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు

తిరుపతి(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను సవరించినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. 'ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 9వ తేదీలోపు ఫీజులు చెల్లించవచ్చు. ఆ తర్వాత రూ. 50 అపరాధ రుసుంతో 12 వరకు, రూ. 200 అపరాధంతో 15 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 18వ తేదీ వరకు ఫీజు చెల్లించొచ్చు. ఆ తర్వాత గడువు పొడిగించే పరిస్థితి ఉండదు. ఒకేషనల్ విద్యార్థులు వృత్తి ఫీజును కూడా దీతో పాటే చెల్లించాలి. ప్రత్యేక ప్రతిభావంత- కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధికంగా ఫీజులు వసూలుచేసే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. యూడైస్ నమోదులో పొరపాట్లు జరగకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రతగా ఉండాలి. యూడైస్‌లో వివరాల నమోదు, ధ్రువీకరణ తర్వాత విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్ నుంచి ఫీజులు చెల్లించాలి' అని ప్రధానోపాధ్యాయులకు డీఈవో సూచించారు.

● సంస్కృత వర్సిటీలో

కీచకపర్వంపై కేసు

● ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఫోన్లు
● బాధితురాలి వాగ్మూలం నమోదుకు పోలీసుల నిర్ణయం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో కీచకపర్వంపై కేసు నమోదైంది. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెస్ట్ సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వెంటనే ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణకుమార్, శేఖర్‌రెడ్డి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వారి సంభాషణ రికార్డులను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. సాంకేతిక ఆధారాల సేకరణ కోసం వారిద్దరి సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు సీఐ చెప్పారు. కాగా, అసిస్టెంట్ లక్ష్మణ్‌కుమార్‌పై బాధితురాలు వారం కిందట వీసీ కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాక ఆయన్ను సస్పెండ్ చేస్తూ వీసీ ఆదేశాలు జారీ చేశారు. ఇదే ఘటనపై వీడియో తీసి ఆమెను లైంగికంగా వేధించిన మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ రెడ్డి ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలు నుంచి ఫిర్యాదు లేకపోవడంతో విచారణకు ఇబ్బందులు రావచ్చనే ఆలోచనతో ఉన్నారు. అందుకని ఆమెను విచారించడానికి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసులు త్వరలో ఒడిశా వెళ్లనున్నట్లు తెలిసింది. లేదా ఆమెను తిరుపతికి రప్పించి వాగ్మూలం తీసుకోవడమా అనే దిశగానూ ఆలోచిస్తున్నట్లు సమాచారం. నిందితులపై చర్యలు తీసుకోవాలంటే బాధితురాలి వాగ్మూలం అవసరమని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ఎస్సీ, మహిళ, హక్కుల కమిషన్‌కు ఎంపీ ఫిర్యాదు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్ ఘటనపై ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, జాతీయ ఎస్సీ.. మహిళా.. మానవ హక్కుల కమిషన్లకు లేఖలు రాశారు. వీరి వేధింపుల కారణంగా విద్యార్థిని చదువు ఆపేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమన్నారు. ఈ ఘటన తీవ్రతను, బాధితురాలి భద్రతను, ఆమె ఎదుర్కొన్న మానసిక వేదనను దృష్టిలో ఉంచుకొని ఈ కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరారు. బాధితురాలిపై ఒత్తిడి లేకుండా ఉండేందుకు తగిన రక్షణ కల్పించి, ఆమె చదువుకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల్లో ఇలాంటి వేధింపులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమగ్ర విచారణ చేపడుతున్నాం

ఓ విద్యార్థిని పట్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ కీచక పర్వంపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా ఆదివారం స్పందించారు. 'ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేశాం. ఈ ఘటనపై కమిటీ చేత విచారణ చేపడుతున్నాం. పోలీసులకూ ఫిర్యాదు చేశాం. విద్యార్థుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం' అని ఒక ప్రకటనలో తెలిపారు.

ఏకలవ్య గురుకులంలో ఉపాధ్యాయుల దాష్టీకం

● అల్లరి చేస్తున్నారని విద్యార్థులను చితకబాదిన వైనం
● తల్లిదండ్రుల ఆందోళన, పోలీసుల విచారణ
● వైస్ ప్రిన్సిపాల్, మరో టీచర్ సస్పెన్షన్



విద్యార్థికి తగిలిన దెబ్బలు - విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీకాంత్

ఓజిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఓజిలి మండలం వాకాటివారికండ్రిగ వద్ద ఉన్న ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో 20 విద్యార్థులను ఇద్దరు ఉపాధ్యాయులు విచక్షణారహితంగా చితకబాదిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు.. శనివారం సాయంత్రం స్టడీ అవర్‌లో చదువుకోకుండా అల్లరి చేస్తున్నారంటూ వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ 20మంది ఏడో తరగతి విద్యార్థులను చితకబాదారు. మంచినీటి పైప్‌తో కొట్టడంతో పలుచోట్ల విద్యార్థుల చర్మం కమిలిపోయింది. ఆదివారం పాఠశాలకు వెళ్లిన తల్లిదండ్రులు పిల్లల చర్మం కమిలిపోయి, వాతలు కనిపించడంతో ఆరా తీశారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తీవ్రంగా కొట్టారని, అతనికి హిందీ టీచర్ హరికృష్ణ సహకరించారని పిల్లలు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఎవరినీ పాఠశాల లోపలకు వెళ్లనీయకుండా ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థుల తలిదండ్రులు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ గురుకుల పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులకు, విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, హిందీ టీచర్ హరికృష్ణను ఉన్నతాధికారులు ఆదివారం సస్పెండ్ చేశారు.

● ఫిర్యాదుల సమాచారం కోసం

1100కు కాల్ చేయండి

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తామిచ్చిన అర్జీల్లో పేర్కొన్న సమస్యలు పరిష్కారం కాకపోయినా.. తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నా 'మీకోసం కాల్ సెంటర్ 1100'కు ఫోను చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మీకోసం.ఏపీ.జీవోవి.ఐఎన్'లో అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇక, కలెక్టరేట్‌లో సోమవారం 10 నుంచి 12 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. సమస్య పరిష్కారమైతే ఫోన్లకు మెసేజ్ వస్తుందన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సాప్‌ల ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలని సూచించారు.

షేర్ ఆటో ఎక్కుతున్నారా?

● మహిళలూ కాస్త జాగ్రత్త
● తిరుపతి రూరల్‌లో మత్తుమందు చల్లి, కొట్టి గొలుసు లాక్కెళ్లిన డ్రైవరు, ఇద్దరు మహిళలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): షేర్ ఆటో ఎక్కుతున్నారా? అప్పటికే లోపలున్నది మహిళలే కదా అని కాస్త ఏమరపాటుగా ఉంటున్నారా? అయితే కాస్త జాగ్రత్తగా ఉండాలని చెబుతోంది తిరుపతి రూరల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఘటన. ఆ ఘటనకు సంబంధించి తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. పెరుమాళ్లపల్లికి చెందిన మల్లిక వ్యవసాయ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. డ్యూటీ ముగించుకుని షేర్ ఆటోలో ఇంటికి బయలుదేరారు. ఆ ఆటోలో అప్పటికే ఇద్దరు మహిళలు ఉన్నారు. ఆటో వెళ్లే క్రమంలో ఆ ఇద్దరు మహిళలు మల్లికపై మత్తు మందు చల్లారు. ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో ఉన్న ఆమె తలపై రాడ్డుతో కొట్టారు. రక్తం కారుతుండగానే ఆమె మెడలోని దాదాపు నాలుగు సవర్ల బంగారు బొట్టు చైను లాక్కొన్నారు. ఇలా ఆ ఇద్దరు మహిళలతో ఆటో డ్రైవరు చేతులు కలిపి దారుణానికి ఒడిగట్టారు. ఆ తర్వాత పెరుమాళ్లపల్లి సమీపంలోని బాలాజీ అకాడమీ స్కూలు వద్ద నడుస్తున్న ఆటో నుంచి మల్లికను కిందకు తోసేశారు. దీన్ని గమనించిన స్థానికులు కొందరు 108 అంబులెన్సు ద్వారా బాధితురాలిని తిరుపతి రుయాకు తరలించారు. తలపై బలమైన గాయాలైనట్లు రుయా వైద్యులు తెలిపారు. జరిగిన ఘటనపై ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి నుంచి వాగ్మూలం నమోదు చేశారు. నిందితుల ఆచూకీ గుర్తించడానికి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకుంటామని డీఎస్పీ చెప్పారు. ఆటోలు, షేర్ ఆటోలు ఎక్కే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల ఫొటోలు, వాహన నెంబర్లు గమనించి తక్షణం డయల్ 112 కు కాల్ చేయాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.


గాయపడిన మల్లిక


టవర్‌క్లాక్ సెంటర్ వద్ద దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నెల్లూరులో కలపాలంటూ రిలే దీక్ష

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని, లేకుంటే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. ఇదే డిమాండ్‌తో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు మద్దతు ప్రకటించారన్నారు. మొదటిరోజు దీక్షలో జేఏసీ ప్రతినిధులతో పాటు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరే వరకు శాంతియుతంగా ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, శంకర్ రెడ్డి, జమాలుల్లా, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు గుండె కోత

'దిత్వా' తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు కైవల్యా నది ఉధ్రుతంగా ప్రవహించింది. డక్కిలి మండలం శ్రీపురం వద్ద నది ఉప్పొంగి ప్రవహించడంతో పక్కన ఉన్న వరి పంటలు కోతకు గురయ్యాయి. వాటిని చదును చేయాలంటే పెద్దమొత్తంలో ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

- డక్కిలి, ఆంధ్రజ్యోతి



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస మంగాపురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మోహన్ సోదరుడు అంతరాజి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరుపతిలోని అమెరికన్ కంటి హాస్పిటల్ వైద్య బృందంతో శ్రీనివాస మంగాపురం గ్రామస్థులకు, పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అంతరాజి కళావతి, పూల సురేష్, యుగంధర్, నవీన్, కుమార్, తేజ, చంద్రిక, కార్తీక్, పేరాల వెంకటేష్, తొర్రూరు సుధాకర్, నిరంజన్, పాల్గొన్నారు.

ముగిసిన ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్



ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

పాకాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. సహచర సమాంతర ఆలోచనల సామాజిక వేదిక, సత్యం చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహించాయి. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు సంబంధించిన 190 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతల వివరాలు సోమవారం వెల్లడిస్తామని, ట్రోఫీలు, నగదు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ డైరెక్టర్ మారసాని విజయబాబు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయండి



రామచంద్రాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట రామాపురం- అడపారెడ్డిపల్లి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. తిరుపతి - పచ్చికాపలం ప్రధా రహదారి నుంచి అడపారెడ్డిపల్లి వరకు ఉన్న తారురోడ్డు వర్షాలకు గుంతలమయం అయింది. తిరుపతి చెత్తను చుట్టుగుంట మీదుగా డంపింగ్ యార్డుకు భారీ వాహనాల్లో తరలిస్తుంటారు. దీని వలన గ్రామంలోని తారురోడ్డు 500 మీటర్ల దూరం పెద్దపెద్దగుంతలు ఏర్పడి వర్షాలకు బురద చేరింది. వాహన చోదకులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బాబోయ్ భౌభౌ..!



తనపల్లెలో రహదారిపై గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

తిరుపతిరూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో నడివీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న గ్రామసింహాలు స్థానికులు, వాహన దారులను భయకంపితుల్ని చేస్తున్నాయి. ఎక్కడ చూసినా పదులసంఖ్యలో కుక్కలు గుంపులు.. గుంపులుగా దర్శనమిస్తున్నాయి. నగరానికి చేరువుగా ఉన్న గాంధీపురం, అవిలాల, ధనలక్ష్మీనగర్, శ్రీనివాసపురం, తనపల్లె తదితర పంచాయతీల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంది. రోడ్లపై ప్రయాణించే వాహన దారుల వెంటపరుగులు పెడుతుండడంతో ఎక్కడ మీదపడుతాయోనని వారు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వేగంగా ప్రయాణించే వాహనదారులు వీటిని తప్పించబోయి అదపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే వీధుల్లో తిరిగే చిన్నారులు, బడికి వెళ్లే విద్యార్థులు, పాదచారులపై దాడులకు దిగుతున్నాయి. సాయంత్రం సమయాల్లో విద్యా సంస్థలు, ట్యూషన్ల నుంచి ఇంటికి చేరుకునే విద్యార్థులు ఒంటరిగా రావడానికి ఇబ్బంది పడుతున్నారు. పలు పంచాయతీల్లో ఇదే పరిస్థితి ఉంది. వీధుల్లో సంచరించే శునకాలకు స్టెరిలైజ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరేళ్ల క్రితం కొట్టుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- పట్టించుకోని అధికారులు
- నీరున్నా సాగుచేయలేని దుస్థితిలో రైతులు

పాకాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని పెద్దగోర్పాడు గ్రామంలో పాకాల పెద్దవంక సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రెండు స్తంభాలు కొట్టుకుపోయాయి. వాటిని పునరుద్ధరించాలని అప్పటి నుంచి రైతులు, గ్రామస్తులు కోరుతూనే ఉన్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనా అమర్చకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద మూడు వ్యవసాయ, పంచాయతీ తాగునీటి బోరు కనెక్షన్‌లు ఉన్నాయి. వర్షాలు కురిసి పుష్కలంగా నీరు ఉన్నా పంటలు సాగు చేసుకోలేని దుస్థితి నెలకొంది. ఈ సమస్యను విద్యుత్ శాఖ రూరల్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తన దృష్టికి రాలేదని సమాధానమిచ్చారు. ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



డీడీ అందజేస్తున్న దాత శివప్రసాద్

తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. అమెరికాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ భక్తుడు శివప్రసాద్ మొత్తాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళం డీడీని ఆదివారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. బోర్డు సభ్యుడు సదాశివరావు కూడా ఉన్నారు.

టెక్నాలజీ, ఇన్నోవేషన్‌పై నేడు వర్క్‌షాప్

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈలకు టెక్నాలజీ, ఇన్నోవేషన్, మేధో సంపత్తి హక్కులపై సోమవారం మంగళగిరిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ(ఎన్‌ఆర్‌డీసీ), ఏపీ ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి సంస్థ దీనిని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లలో ఆవిష్కరణ సామర్థ్యం, సాంకేతిక స్వీకరణ, మేధో సంపత్తిని పెంచే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు.

తిరుపతి- షిర్డీ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రేపు ప్రారంభం

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-సాయినగర్ షిర్డీ మధ్య నూతనంగా ప్రవేశపెడుతున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును 9న కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించనున్నారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి బీ.సి.జనార్దన్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పాల్గొంటారు. తిరుపతి-సాయినగర్‌షిర్డీ-తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు (17425/17426) గూడూరు, గుంటూరు, సికింద్రాబాద్, వికారాబాద్, ఛత్రపతి శంభాజీ నగర్ మీదుగా నడుస్తుంది. ఈ రైలుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందుతాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనంతో అటవీ సిబ్బంది

భాకరాపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళంపేట మీదుగా తమిళనాడుకు ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు భాకరాపేట-మంగళంపేట మార్గంలోని పూజారివాండ్లపల్లె వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆదివారం తెల్లవారుజామున అటుగా వచ్చిన కారును ఆపగా తమను చూసి అందులోని వ్యక్తులు పారిపోయారన్నారు. కారులో 161 కిలోల బరువు గల 9 ఎర్రచందనం దుంగలు దొరికాయని తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌బీవోలు సదాశివయ్య, రాజేశ్ కుమార్, నిఖిల్, డ్రైవర్ రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

చంద్రగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని తిరుమల వీజీవో రామకుమార్ అన్నారు. శ్రీనివాసమంగాపురం సమీపంలోని గల నారాయణ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామ కుమార్ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిం చాల న్నారు. నారాయణ విద్యాసంస్థల నిర్వహణాధికారి కొండలరావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ ముందున్నాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల కాలేజ్ కోర్ డీన్ ఏఎస్‌ఆర్, ఏజీఎంలు శ్రీనివాసులు, రవీంద్రఫణికుమార్, ప్రిన్సిపాల్ రవికాంత్‌గుప్తా, లీలాధర్, శ్రీనివాసులు, అకడమిక్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు : ఆరుగురికి గాయాలు





నుజ్జు నుజ్జు అయిన కారు - కూలిపోయిన కల్వర్టు గోడ

చంద్రగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగరాల వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున కారు కల్వర్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అయ్యప్ప స్వాములకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రైల్వే కోడూరుకు చెందిన సాయికుమార్, అజయ్‌కుమార్, జస్వంత్, మణికంఠ, నితీష్, యోగేష్ శబరిమలైలోని అయ్యప్పస్వామికి ఇరుముడి చెల్లించి తిరిగి రైల్వే కోడూరుకు వస్తుండగా ఆదివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో అగరాల సమీపంలోని నారాయణ కళాశాల వద్ద రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొని కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కల్వర్టు గోడ కూలిపోయింది. కారు నుజ్జు నుజ్జు అయింది. కారులో ఉన్న సాయికుమార్, అజయ్‌కుమార్, జస్వంత్, మణికంఠ, నితీష్, యోగేష్‌లకు గాయాలయ్యాయి. సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పీపీపీకి వ్యతిరేకంగా లక్షా 16వేల సంతకాలు

వైసీపీ చంద్రగిరి ఇన్‌చార్జి మోహిత్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మోహిత్‌రెడ్డి, వైసీపీ నేతలు

తిరుపతిరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల పీపీపీకి వ్యతిరేకంగా చంద్రగిరి నియోజకవర్గంలోని 116 గ్రామపంచాయతీల్లో లక్షా16వేల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేసినట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. దీన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం తుమ్మలగుంట లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ నేతలతో కలసి అభినందన సభ నిర్వహించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్న ప్రతిరోజూ ప్రజలు మీకు చరమగీతం పాడడానికి దగ్గరపడుతున్న రోజుగా పాలకులు గుర్తించు కోవాలని హెచ్చరించారు. చర్యకు ప్రతిచర్య తప్పనిసరిగా ఉంటుందని గుర్తించుకోవాలన్నారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాసరిమఠంలో పోలీసుల కార్డన్ సెర్చ్

- రికార్డుల్లేని 11 ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు (ఆంధ్రజ్యోతి): అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. పోలీసుల బూట్ల చప్పుడు, పదుల సంఖ్యలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున గుమికూడటంతో తిరుపతి దాసరిమఠంలో కలకలం రేగింది. కార్డన్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు ఇళ్లిళ్లూ తిరిగారు. ఇంట్లో ఎవరెవరు.. ఎంత మంది ఉంటున్నారు. అందరికీ ఆధార్ కార్డులు, ఓటరు ఐడీ కార్డులు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. ఆ కార్డులు చూపించమని అడిగారు. దాసరిమఠంలో ఎక్కువగా మున్సిపల్, రైల్వే కార్మికులు, ఆటో వాలాలు, కూలీలతో పాటు కొందరు ఆకతాయిగా తిరిగేవాళ్లూ ఉన్నారు. తమిళనాడు కల్చర్ ఎక్కువ. ఈ క్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారు జామున డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు హేమాద్రి, ఈశ్వరయ్య, రామాంజనేయులు, మహబూబ్ బాషా, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు ఎస్‌ఐలు, ఎస్టీఎఫ్ పార్టీ బలగాలు, సిబ్బంది కలసి ఏక కాలంలో సోదాలు చేశారు. ఏదైనా ఘటన జరిగినా, అనుమానితులున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనవసరంగా గలాటాలు, ఘర్షణలకు దిగితే ఉపేక్షించమని హెచ్చరించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో రికార్డులు లేని దాదాపు 11 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్ చేశారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని సీఐ చెప్పారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. వేకువజామునే వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

నీట మునిగి యువకుడి మృతి



జగన్ మృతదేహం

తవణంపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ప్రమాదవశాత్తూ బాహుదానదిలో నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు చవటపల్లెకు చెందిన వాసు, భార్గవిల కుమారుడు జగన్(17) ఆదివారం ఉత్తరబ్రాహ్మణపల్లెలో తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లాడు. ఈ సందర్భంగా బంధువులు, తల్లిదండ్రులతోకలిసి గ్రామ సమీపంలోని బాహుదానది వద్దకు వెళ్లాడు. జగన్ ప్రమాదవశాత్తూ నదిలో పడి నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని బంధువులు వెలికి తీశారు. చెట్టంత కొడుకు కళ్ల ముందే నీట మునిగి మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

గుంతలమయంగా రోడ్డు

తిరుపతి (జీవకోన), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరు పతి కరకంబాడి రోడ్డు (ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే ప్రధా రోడ్డు ముందు) గుంతలమయంగా మారింది. రాత్రి సమయాల్లో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంతలకు ప్యాచ్ వర్క్ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



తుప్పుపడుతున్న చెత్త ట్రాక్టర్లు

తిరుపతిరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో చెత్తసేకరణకు స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం) ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన ట్రాక్టర్లు తుప్పుపడుతున్నాయి. పంచాయతీల కార్యాలయ ప్రాంగణం, ఖాళీస్థలాల్లో ఆరుబయటే వృథాగా వది లేశారు. వీటికి కనీసం పైకప్పు కూడా వేయకపోవడంతో ఎండకి ఎండి..వానకు తడుస్తూ తప్పుపడుతున్నాయి. ఏడాదికిపైగా నిరుపయోగంగా వదిలేయడంతో ట్రాక్టర్ ఇంజిన్లు మరమ్మతులకు గురయ్యాయి. గతేడాది నవంబరులో మండలంలో తొలి విడతగా 16 కొత్త ట్రాక్టర్లు పంపిణీ చేశారు. తొలుత ఇంజిన్ మాత్రమే ఇచ్చి ట్రక్కు ఇవ్వకపోవడంతో వాటిని వినియోగించలేదు. ఇటీవల స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ట్రక్కులని కూడా అందించింది. అయినా ఇప్పటికీ వినియోగంలోకి తేకుండా అలాగే వృథాగా వదిలేసి ఉన్నారు. మరోపక్క పల్లెలో చెత్తసేకరణకు పారిశుధ్య సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. ట్రాక్టర్ ఇంజిన్లు మరమ్మతులకు గురికావడం, డ్రైవర్లు లేని కారణంగా వినియోగించలేదని, మరమ్మతులకు సత్వర చర్యలు చేపడుతామని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు.







సి.మల్లవరం పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్ ఇంజిన్, ట్రక్కు మూలనపడ్డ ఈ-ఆటో

సోమలను వీడని ఏనుగులు

- టమోటా, మామిడి తోటలపై దాడి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



పత్రపల్లె వద్ద ధ్వంసమైన టమోటా తోట


సోమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలాన్ని పది రోజులుగా ఓ నాలుగు ఏనుగులు వీడటం లేదు. శనివారం రాత్రి ఆవులపల్లె పంచాయతీలోని పత్రపల్లె, ఎగువ కొత్తూరు సమీపంలోని టమోటా, మామిడి తోటలపై దాడి చేశాయి. పత్రపల్లెకు చెందిన రమణారెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రఘుపతి రెడ్డి, గోవిందరెడ్డికి చెందిన మామిడి, టమోటా తోటలను తొక్కేసి.. కంచెను, రాతి కూసాలను విరిచేశాయి. ఎగువ కొత్తూరులోని రైతు ల తోటలనూ ధ్వంసం చేశాయి. తోటలు ధ్వంసమవడంతో పెట్టుబడి కూడా దక్కదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటల వద్ద రాత్రి కాపుకాస్తున్న రైతులు ఏనుగులను గమనించి గ్రామానికి పరుగులు తీశారు. ఏడాది కిందట కూడా పత్రపల్లెలో ఏనుగులు దాడి చేయడంతో రాష్ట్ర, జిల్లా స్థాయి అటవీ అధికారులొచ్చి పరిశీలించారు. సోలార్ కంచెతోపాటు ఏనుగుల దాడుల నివారణకు బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, నష్టపరిహారం పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకనైనా ఏనుగుల దాడులను నివారించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

గుడిపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరుస అత్యాచారాలు, హత్యాయత్నాలు, అక్రమ డ్రగ్స్ వ్యాపారాల్లో నిందితుడైన మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తుడిని గుడిపాల పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సాయినాథ్ ఆ వివరాలను ఆదివారం మీడియాకు తెలిపారు. ఈనెల 3న గుడిపాల మండలంలోని అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదుపై తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అలెక్స్ అనే నిందితుడిపై అత్యాచారం కేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు. 2010లో తొలినేరం చేసి జైలుకు వెళ్లిన నిందితుడు.. అప్పటినుంచి దొంగతనాలు, దారి దోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు, కొట్లాట కేసుల్లో పాల్గొని కరుడుగట్టిన నేరస్తుడిగా మారాడు. 2023లో జైలు నుంచి విడుదలయ్యాక పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గుడిపాల మండలానికి చేరుకున్నాడు. ఈక్రమంలో అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఓ కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. కుటుంబ యజమాని కుమార్తెపై ప్రేమ పేరుతో బెదిరింపులకు పాల్పడి ఏడాదిగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. గతనెల 24న బాధితురాలిని అపహరించి, ఆమె తల్లిదండ్రులు, తమ్ముడిపై కత్తితో దాడిచేశాడు. పెప్పర్ స్ప్రే చల్లాడు. ఆపై బాధితురాలిని వారంరోజులపాటు మామిడితోపులో నిర్బంధించి అత్యాచారం చేశాడు. ఈనెల ఒకటో తేదీన బాధితురాలిని ఇంటివద్ద వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ క్రమంలో ఆదివారం నిందితుడిని చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మిందపాళ్యం క్రాస్‌వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి వద్ద నుంచి ఇనుప రాడ్డు, పెప్పర్ స్ప్రే, మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషి చేసిన పోలీసులను ఎస్పీ తుషార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

సౌభ్రాతృత్వంతో అసూయ దూరం

- ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యాంత్రిక జీవితంలో ఐక్యత చాలా ప్రధానమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకాళహస్తీశ్వర శతక ప్రవచన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేటి సమాజంలో ఐక్యత లోపించి, మత మౌఢ్యం ప్రబలి మనుషుల మధ్య అశాంతి రగిలిస్తున్నదని గరికపాటి ఆవేదన చెందారు. కావాల్సింది మత జాడ్యం కాదని, పరస్పర స్నేహ సౌభ్రాతృత్వాలన్నారు. వీటితో మనలోని అసూయ, ద్వేషాలు దూరమవుతాయన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.13 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,007

తలనీలాలు సమర్పించినవారు: 39,154

అన్నమయ్య మార్గంలో భక్తులను అనుమతిస్తే బాగుండేది

● మాజీ మంత్రి పేర్ని నాని



తిరుమల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): స్వామిమాల ధరించి అన్నమయ్య మార్గంలో వచ్చే భక్తులను అనుమతిస్తే బాగుండేదని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య మార్గంలో భక్తులు నడిచిరావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భావోద్వేగంతో వచ్చే భక్తులను ఇన్నాళ్లు అనుమతించి ఇప్పుడు ఆపడం బాధాకరమన్నారు. అటవీ శాఖాధికారులు ఈ విషయంలో పునరాలోచించాలని కోరారు.

రమాదేవి ఆస్పత్రిలో పోలీసులకు ఉచిత వైద్యసేవలు



డాక్టర్ శశిధర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరమాదేవి ఆస్పత్రిలో పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్యసేవలను పూర్తి ఉచితంగా తీసుకువచ్చామని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి అన్నారు. ఆస్పత్రిలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఓపీ, అంబులెన్సు సర్వీసులు, అడ్మిట్ అయితే ఏసీ గదులు, ఆహారం, శస్త్ర చికిత్సలకు సంబంధించిన ఇంప్లాంట్స్ ఇలా అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ అవకాశాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాణిపాక ఆలయ ఛైర్మన్‌కు సత్కారం



తిరుపతి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలకమండలి ఛైర్మన్ సురేంద్ర నాయుడిని తిరుపతి టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. ఆదివారం కుప్పంలో జరిగిన ప్రమాణ స్వీకారానికి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ నేతృత్వంలో నాయకులు వెళ్లారు. ఛైర్మన్‌తోపాటు పాలకమండలి సభ్యులను శాలువా, శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నేతలు ఊట్ల సురేంద్ర నాయుడు, జగ్గా, సుబ్రహ్మణ్యం నాయుడు. హేమంత్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సంధ్యావందనం



సంధ్యావందనంలో పాల్గొన్న పౌరోహితులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): కేసీదాసు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఖాదీకాలనీలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం ఆదివారం సామూహిక సంధ్యావందనం కార్యక్రమం నిర్వహించారు. ఏడుగురు పౌరోహితులు, జపతులు ప్రాతఃకాల సంధ్యావందన సహిత గాయత్రీ మంత్ర పఠించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీపాద యశోనాయక్ - ద్వారక తిరుమలరావు

తిరుమల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

ప్రమాదకరంగా ఉపాధ్యాయ నగర్ రోడ్డు

తిరుపతి (జీవకోన), డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి నగర పరిధిలోని 50వ డివిజన్ ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు ప్రమాద కరంగా ఉంది. ప్రధాన రోడ్డుకు ఆనుకుని పెద్ద కాలువ ఉంది. ఇందు కోసం రోడ్డు పక్కన సైడ్‌వాల్ లాంటిది చిన్నది నిర్మించారు. కొన్నినెలల క్రితం కురిసిన వర్షాలకు ఆ సైడ్‌వాల్ పడిపోయింది. దీంతో రోడ్డు కూడా కాస్త దెబ్బతింది. పెద్ద వాహనాలు వెళితే రోడ్డు కొంతభాగం కుంగే పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో ఏ మాత్రం ఏమరపాటుగా వచ్చినా ప్రమాదాల బారిన పడాల్సిందే. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.



ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో పడిపోయి ప్రమాదకరంగా ఉన్న సైడ్‌వాల్

పౌర చైతన్య వేదిక సదస్సును జయప్రదం చేయండి

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆఫీసర్స్ క్లబ్ హాలులో ఈ నెల 10వ తేదీన జరిగే పౌర చైతన్య వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఈ వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్, కార్యదర్శి ఏఎన్.పరమేశ్వరరావు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజానికి అనుబంధంగా వేదిక పనిచేస్తుందన్నారు. సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షుడు ఎ.రాఘవశర్మ, కోశాధికారి హరీష్, ఆర్.షరీఫ్ పాల్గొన్నారు.

హిందూ పండగలకు సెలవులెక్కడ!

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి ప్రకటించిన ఐచ్ఛిక సెలవుల్లో హిందూ పండగలు లేకపోవడం బాధాకరమని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నరక చతుర్దశి సెలవు తొలగిస్తే ప్రస్తుత పాలకులు కార్తీక పౌర్ణమిని తొలగించారన్నారు. రథసప్తమి, నాగులచవితి, వైకుంఠ ఏకాదశి, స్కందషష్ఠి, గీతా జయంతి, నరక చతుర్దశి, రాఖీ పౌర్ణమి, వసంత పంచమి, అట్లతద్ది, గురుపౌర్ణమి, ఏరువాక పౌర్ణమి, తొలి ఏకాదశి, పరశురామ జయంతి, విశ్వకర్మ జయంతి, అక్షయతిథి నాడు సెలవు ప్రకటించాలని కోరారు.

కరుణాకర్‌రెడ్డిని విమర్శిస్తే కథ తేలుస్తాం

● భానుప్రకాష్‌రెడ్డికి వైసీపీ నేత వార్నింగ్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : 'మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే నీ కథ తేలుస్తాం' అంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లాని బాబు హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ముసుగులో అవినీతి దందాలకు పాల్పడుతున్న భానుప్రకాష్‌రెడ్డి కరుణాకరరెడ్డిపై అభాండాలు వేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు అంజనేయులు, తలారి రాజేంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, గురవయ్య పాల్గొన్నారు.

11న పెట్రోలియం ట్రేడర్ల సమావేశం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఈ నెల 11వ తేదీన పెట్రోలియం ట్రేడర్ల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మనుబోలు మధుసూదనరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రేడర్ల సమస్యలపై చర్చించి, పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ డీలర్లు హాజరుకావాలని కోరారు.

తిరుపతి-షిరిడీ రైలు ప్రారంభానికి ఏర్పాట్లు



తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-షిరిడీ రెగ్యులర్ రైలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ పాల్గొన నుండటంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఆదివారం సభ ఏర్పాట్లను డిప్యూటీ సీటీఈ పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు దరూరు ప్రభాకర్, మాధవరావు, కాంట్రాక్టర్లు ఆర్‌కె.సింగ్, సంజయ్ శర్మ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న భవనాలు

భయాందోళనలో సీబీఎస్ సిబ్బంది.. ప్రయాణికులు



సెంట్రల్ బస్టాండు ముఖద్వారం వద్ద



అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయం

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులో భవనాలు పెచ్చులూడిపడుతున్నాయి. 1977లో ప్రారంభించిన శ్రీహరి బస్టాండు భవనం ఇప్పటికే శిథిలావస్థలో ఉంది. దీనికితోడు ఇటీవల వరుస తుఫాన్ల కారణంగా భవనంపై నీరు నిలిచి స్లాబ్ మరింత చెమ్మగిల్లి పెచ్చులూడుతోంది. డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయాలు, క్యాష్ కలెక్షన్ కౌంటర్లలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండటంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భవనంపైకి వెళ్లే మెట్ల భాగంలోని గోడలు కూడా ఇటీవల కూలిపోయాయి. ఉద్యోగుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు పరిస్థితిని విజయవాడ ప్రధాన కార్యాలయానికి తెలియజేశారు. 'ఎలాగో నూతన బస్సు టర్మినల్ నిర్మిస్తున్నాం కదా ఇప్పుడు చర్యలు అవసరమా' అనే కోణంలో యాజమాన్యం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అలాంటప్పుడు కనీసం పెచ్చులు కిందపడకుండా సీలింగ్‌కు నెట్ వంటి రక్షణ ఏర్పాట్లు చేయాలని సిబ్బంది, ప్రయాణికులు కోరుతున్నారు.





క్యాష్ కలెక్షన్ కౌంటర్ వద్ద.. - తిరుపతి డిపో మేనేజర్ కార్యాలయంలో

సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీత

హెచ్‌డీపీపీ కార్యదర్శి రఘునాథ్



బహుమతులందుకున్న విద్యార్థులతో హెచ్‌డీపీపీ అధికారులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మానవ సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందని హెచ్‌డీపీపీ కార్యదర్శి శ్రీరాంరఘునాథ్ అన్నారు. స్థానిక అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాలపై జరిగిన కంఠస్థ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కోణంలో మనిషి ఎలా జీవించాలో భగవద్గీత చెబుతుందన్నారు. చెడుమీద మంచి విజయం సాధించడమే గీతా సారాంశంగా పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే భగవద్గీత శ్లోకాలను పఠించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీపీపీ ఏఈవో సి.సత్యనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోకిల పాల్గొన్నారు.

పోటీల విజేతలు వీరే..

కంఠస్థ పోటీల మొదటి విభాగంలో కేపీ ముకుంద, కేపీ శ్రీ, ఎం.వైష్ణవి, రెండో విభాగంలో డి.నిశాంత్ చక్రవర్తి, ఎం.జస్వంత్, ఎస్.నాగవేణి, మూడవ విభాగంలో పీహెచ్. వెంకటనారాయణ, ఎం.లహరి, ఎస్.ఉమామహేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వాలు

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి, రైతులను దివాళా తీయించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవన్‌లో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి వ్యతిరేకంగా నాలుగు చట్టాలను తీసుకొచ్చిందని, వాటికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన నూతన విత్తన, విద్యుత్ చట్టాలు కార్పొరేటర్లకు ఉపయోగపడేవిధంగా ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో మామిడి, టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మామిడి రైతుల బిల్లులు చెల్లించాలని ఈనెల 22వ తేదీన చిత్తూరు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు, నాయకులు టి.జనార్దన్, సుధాకర్‌రెడ్డి, మునిరత్నం నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇ-సేవ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తొలగించిన ఇ-సేవా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సైకిల్ యాత్ర చేపట్టారు. ఆదివారం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ఈ యాత్రను సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.సుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర అమరావతి వరకు సాగుతుందన్నారు. తొలగించిన ఉద్యోగులను అధికారంలోకి వచ్చిన వెంటనే విధుల్లోకి తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, అప్పటి వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఉద్యోగుల పోరాటానికి సీఐటీయూ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇ-సేవా కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు నాగేశ్వరరావు, బాలసుబ్రమణ్యం, రామకృష్ణారెడ్డి, రవికిరణ్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి -తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విహార్ అకాడమీ ఆఫ్ డ్యాన్స్‌కు చెందిన కళాకారుల భరతనాట్య నృత్య ప్రదర్శన అలరించింది. శిల్పారామం ఇన్‌చార్జి ఏవో సూర్య తేజ, ఏఈ రాధాకృష్ణ కళాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

ముగిసిన బాలల సైన్స్ ఫెస్టివల్



బహుమతులు అందజేస్తున్న విక్రమ్‌కుమార్‌రెడ్డి

మంగళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవం సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహించిన నాలుగవ బాలల సైన్స్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. సైన్స్‌ఫేర్, సైన్స్ డ్రామా, ఐడియా థాన్ విభాగాలలో తిరుపతి చుట్టుపక్కల పాఠశాలల నుంచి 70 వినూత్న స్టెమ్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశానికి, సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను తయారు చేసే విధంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులను ఉత్తమ పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, గౌరవాధ్యక్షుడు నడ్డి నారాయణ, జనరల్ సెక్రటరీ గురునాథం, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, సైన్స్ సెంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పురుషోత్తం పాల్గొన్నారు.

రాస్‌కు బ్రహ్మకుమారీస్ సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న రాస్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): రాస్‌కు బ్రహ్మకుమారీస్ ఉత్తమ సేవా పురస్కారం లభించినట్లు ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు తెలిపారు. సికింద్రాబాద్ మహదేవ్‌పూర్‌లోని సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో ఆదివారం జరిగిన బ్రహ్మకుమారీస్ ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానోత్సవంలో బ్రహ్మకుమారీస్ సామాజిక సేవా కార్యక్రమాల కార్యదర్శి ప్రేమ్‌జీ చేతుల మీదుగా రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు అవార్డు అందుకున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో రాస్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు చెప్పారు.

బినామీ డీలర్లతో ఇక్కట్లు

తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలంలో 20కి పైగా రేషన్ షాపులు బినామీలతో నడుస్తున్నాయని, వారు సరుకులు సరిగా ఇవ్వడం లేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1, 3, 5, 8, 11, 13, 15, 16, 18, 19, 20, 21, 23, 24, 31, 38, 45, 59, 76, 81, 86, 97 చౌక దుకాణాలను డీలర్లు బినామీలకు అప్పగించారు. ఆయా దుకాణాల్లో సరుకులు సరిగా ఇవ్వడం లేదని, తూకాల్లో తేడాలు ఉంటున్నాయని, అడిగితే దుర్భాషలాడుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు. ఒక సమయం అంటూ లేకుండా వారికి ఇష్టం వచ్చినప్పుడు ఓపెన్ చేసి, అర్థగంటకే మూసేస్తున్నారని ఆరోపించారు. రెండు మూడు రోజులు కూడా సరుకులు ఇవ్వడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



సీఎంతో మాట్లాడుతున్న లక్ష్మయ్య

తిరుపతి(జీవకోన), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజకజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లె లక్ష్మయ్య సీఎం చంద్రబాబును కోరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ నుంచి పది మంది రజకులకు టీడీపీ రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించాలన్నారు. ఆలయ కమిటీల్లో అవకాశం కల్పించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన మౌనీష్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తిరుపతిలోని తెలుగునగర్‌లో చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. తెలుగునగర్‌కు చెందిన మాధవీలతకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. చిన్న కుమారుడు మౌనీష్ స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అన్న మృతిచెందినప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్న మౌనీష్ తనకూ చనిపోవాలని ఉందని తరచూ తల్లితో చెప్పేవాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లి మాధవీలతను ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లి ఆమె పనిచేసే మొబైల్ షాపు వద్ద వదిలి ఇంటికొచ్చాడు. బ్లేడుతో చేతులపై కోసుకున్నాడు. ఇల్లంతా రక్త మడుగులా మారింది. అప్పటికీ ప్రాణం పోకపోవడంతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన మాధవీలత ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చింది. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. ఎస్ఐ హేమాద్రి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనువాదుల కుట్రల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశరయ్య

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పీఠికలోని లౌకిక, సోషలిస్ట్ పదాలను తొలగించేందుకు మనువాదులు కుట్రలు చేస్తున్నారని, వారి నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు అభ్యుదయవాదులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య కోరారు. ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ఐక్యతకు, అభ్యుదయ భావజాలానికి ముప్పు ఏర్పడే విధంగా రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టే చర్యలు ఊపందుకున్నాయని తెలిపారు. మతోన్మాదాన్ని పెంచి, ప్రాంతాల మధ్య చిచ్చు రేపడానికే ఎన్డీఏ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఈ చర్యలను దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకించాలని, ఈనెల 18న సీపీఐ చేపట్టే నిరసన కార్యక్రమానికి మద్దతు తెలపాలని కోరారు. అమరావతిలో జరుగుతున్న ల్యాండ్ పూలింగ్‌ను రైతులు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధిని సీఎం పెడచెవిన పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలోని 18 వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం దేవుడిపై రాజకీయాలు చేయడం మానుకుని తప్పు చేసిన వారిని శిక్షించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, కార్యవర్గ సభ్యులు సి.పెంచలయ్య పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పులికాట్ వాచ్ టవర్‌కు తుప్పు


తుప్పుపట్టి విరిగిపోయిన వాచ్‌టవర్

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సుకు వలస వచ్చే పక్షులను సందర్శకులు వీక్షించే వాచ్‌టవర్ తుప్పు పట్టి మరమ్మతులకు గురైంది. అట్టకానితిప్ప - శ్రీహరికోట మార్గంలో పులికాట్ సరస్సు అంచున పక్షులను వీక్షించేందుకు వన్యప్రాణి అధికారులు ఇనుప రేకులతో వాచ్‌టవర్ ఏర్పాటు చేశారు. సందర్శకులు టవర్‌పైకి వెళ్లేందుకు ఇనుప ఊచలు, రేకులతో దారి, దానికి రెండువైపులా రక్షణగా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఆ ఇనుప ఊచలు, రేకులు తుప్పుపట్టి విరిగిపోయి ఉన్నాయి. రక్షణగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ కూడా ఒక పక్క విరిగిపోయింది. ఇటీవల వర్షాలతో పులికాట్‌కు భారీగా వరదనీరు చేసి నిండుకుండను తలపిస్తోంది. సందర్శకుల తాకిడి కూడా అధికంగా ఉంది. సందర్శకులు వీక్షించే వాచ్ టవర్ మరమ్మతులకు గురైనా వన్యప్రాణి అధికారులు పట్టించుకోలేదు. వాచ్‌టవర్‌కు మరమ్మతులు చేసి సందర్శకులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు


తిప్పగుంటపాళెం గ్రామానికి బోటులో వెళుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

చిల్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం ప్రజలకు ఇబ్బందులు లేకుండా హైలెవల్ వంతెన నిర్మాణం చేపటేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న తిప్పగుంటపాళెం గ్రామానికి ఆదివారం బోటులో వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు రోజులుగా తిప్పగుంటపాళెం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయిందని, వర్షాలు తగ్గినా గ్రామానికి వెళ్లే చప్టా వరదనీరు తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామానికి వంతెన నిర్మాణానికి సంబంధించి గతంలో ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. గ్రామస్తులు ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, లీలావతి, సుప్రజ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షన్ రూ.9వేలు, డీఏ సాధన, తెల్లరేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ పథకాలను వర్తింపజేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గోపి, గౌరవ సలహాదారుడిగా శేషయ్య, అధ్యక్షుడిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా రత్నం, ఉదయభాస్కర్, తిరుపాలు, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నారాయణరావుతో పాటు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో గంగాధర్, రాజయ్య, శంకరయ్య, చంద్రమౌళి, నరసింహారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడండి


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో వెంకటగిరి, శ్రీకాళహస్తి ఏఎంసీ ఛైర్మన్లు విశ్వనాథం నాయుడు, చెంచయ్య నాయుడు

వెంకటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును వెంకటగిరి, శ్రీకాళహస్తి ఏఎంసీ ఛైర్మన్లు పునుగోటి విశ్వనాథ నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం విజయవాడలో రాష్ట్రంలోని ఏఎంసీ ఛైర్మన్ల సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న విశ్వనాథ నాయుడు, చెంచయ్య నాయుడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి బాల వీరాంజనేయస్వామిని కలిశారు. గత వైసీపీ పాలనలో టీడీపీ సానుభూతి పరుల పింఛన్లును కక్షగట్టి తొలగించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు

వెంకటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో ఎట్టకేలకు వెంకటగిరి - గూడూరు రోడ్డు మరమ్మతు పనులు మొదలయ్యాయి. ఈ మార్గంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పెద్దగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా తయారయ్యాయి. ఎమ్మెల్యే చొరవతో ఆదివారంమరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయి.


వెంకటగిరి - గూడూరు రోడ్డులో గుంతలను పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

నేటినుంచి రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ

సూళ్లూరుపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు టీచ్ టూల్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈవో సునీల తెలిపారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతిపూజ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో అయ్యప్పస్వామి జ్యోతిపూజ సోమవారం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి సేవాసంఘం తెలిపింది. ఉదయం 6 గంటలకు గణపతిహోమం, 8 గంటలకు కలశాల ఊరేగింపు, 10 గంటలకు స్వామివారి పంచవాయిద్యాల పూజ, సాయంత్రం 5 గంటలకు అఖండ కర్పూరజ్యోతి, అనంతరం అయ్యప్ప స్వామికి నగరోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల సొంత నిధులతో కొరిడి - పేర్నాడు రోడ్డుకు మరమ్మతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొరిడి - పేర్నాడు రోడ్డుకు అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారడంతో తారురోడ్డు కలగానే మిగిలిపోయింది. కనీసం మరమ్మతులైనా చేయండని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుసార్లు విన్నవించుకున్నా ఎవరు పట్టించుకోలేదు.. దిత్వా తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు గ్రావెల్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఆర్టీసీ బస్సు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో స్థానిక టీడీపీ నాయకులే రోడ్డు మరమ్మతులు చేసేందుకు ముందుకొచ్చారు. ఆదివారం కొరిడి, కడపత్ర, దామరాయి పంచాయతీ పరిధిలో ఉన్న టీడీపీ నాయకులు మూడు ఎక్స్‌కవేటర్లతో గుంతలమయంగా ఉన్న రోడ్డును చదును చేసి, గోతులు ఎక్కువగా ఉన్న చోట మట్టితోలి మరమ్మతులు చేశారు. రోడ్డును కమ్మేసిన చెట్లను తొలగింపు పనులు చేపట్టారు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు

మూడు పంచాయతీ పరిధిలో దాదాపు 23 గ్రామాలు ఉన్నాయి. తారురోడ్డు కథ పక్కన పెడితే కనీసం మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గ్రామ ప్రజలు తమను అడుగుతున్నారు. టీడీపీ నాయకులు మాగర్ల తిరుపాల్, గొంజి వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, శేఖర్, అక్కులయ్య కలిసి రోడ్డుకు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

మరమ్మతులు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అట్టకాతిప్ప నుంచి కడపత్ర వరకు 9 కిలో మీటర్లు అధ్వానంగా ఉన్న రోడ్డులో గుంతలను పూడ్చి మరమ్మతులు చేస్తున్నాం.

- శంకరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు


గ్రామోత్సవంలో ఊరేగుతున్న అయ్యప్పస్వామి - దీప జ్యోతులతో మహిళలు

వేడుకగా అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం శనివారం వేడుకగా జరిగింది. ఉదయం గణపతి పూజ, హోమం చేసి అయ్యప్పస్వామికి నెయ్యితో అభిషేకం చేశారు. షార్ బస్టాండు సమీపంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వద్ద అయ్యప్ప ఉత్సవ మూర్తిని వాహనంలో కొలువుదీర్చి పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, సభ్యులు రవీంద్రారెడ్డి, లీలామోహన్‌రెడ్డి కర్పూర జ్యోతిని వెలిగించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. కేరళ బ్యాండ్ మేళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం ఊరేగించారు. మహిళలు దీప జ్యోతులు పట్టుకుని భజన పాటలు పడుతూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలని సైకిల్‌యాత్ర


సైకిల్ యాత్ర చేస్తున్న భగత్‌సింగ్

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌కు చెందిన భగత్‌సింగ్ రామేశ్వరం నుంచి కాశీకి సైకిల్ యాత్ర చేపట్టాడు. 17 రోజు క్రితం రామేశ్వరం నుంచి బయలు దేరిన ఈ యువకుడు మార్గమధ్యంలోని వివిధ ఆలయాలను దర్శించుకుంటూ ఆదివారం పెళ్లకూరు మండలానికి చేరుకున్నాడు. చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలోని చండికాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ నుంచి శ్రీశైలం మల్లిఖార్జునస్వామి, కాశీలో విశ్వనాథస్వామిని దర్శించుకుని యాత్ర ముగిస్తానని చెప్పాడు.

అధికారులపై జగన్ వ్యాఖ్యలు సరికావు


సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పట్ల మాజీ సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం కొత్తూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిలను వాడు.. వీడు అంటూ చులకనగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాఖమూరి కృష్ణమనాయుడు, మదన్‌మోహన్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కలవకూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు కలపాటి సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన బస్సు

చిల్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైటర్ సత్రం వద్ద జాతీయ రహదారిపై అయ్యప్ప భక్తులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. గుంటూరు నుంచి అయ్యప్ప భక్తులు బస్సులో శబరిమలైకు బయలుదేరారు. ఆదివారం చిల్లకూరు మండలంలోని రైటర్ సత్రం వద్ద బస్సు అదుపుతప్పి మెల్లగా రోడ్డుపక్కన బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ఉండగా, 5 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మరో బస్సులో అయ్యప్ప భక్తులు బయలుదేరి వెళ్లారు.

21 వాహనాల సీజ్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద ఆదివారం ఉదయం సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 21 వాహనాలు సీజ్ చేశారు. టిడ్కో ఇళ్ల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, శివశంకర్, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యానగర్‌లో రక్తదానం


రక్తదానం చేస్తున్న దాతలు

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో ఆదివారం చెందోడుకు చెందిన ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. మేరీపల్స్ రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి సురేష్, సాయిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ ప్రతినిధులు లీలామోహన్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో రక్తదాతలను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

వెంకటగిరి ఎస్ఐగా నవనీత

వెంకటగిరి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్ఐగా నవనీత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీగా ఉన్న ఆమెకు వెంకటగిరిలో రెగ్యులర్ ఎస్ఐగా పోస్టింగ్‌గా ఇచ్చారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై జగన్ అనుచిత వ్యాఖ్యలు తగవు


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీసీ సంఘ నాయకులు అన్నారు. ఆదివారం జగన్ వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం సాయంత్రం బీసీ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి గోపినాథ్ జెట్టి, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబుకాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు ఉల్లిపాయల చెంచయ్య, పాలచ్చూరు చంద్రమోహన్, పాలచ్చూరు అమరేంద్ర, బట్టా సుబ్రహ్మణ్యంయాదవ్, కోటి మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు రూ.50వేల విరాళం


టీడీపీ నేత రఫీకి విరాళం అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సీఎస్ తేజ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం రూ.50వేలు విరాళం అందజేశారు. ఆదివారం టీడీపీ నాయకుడు రఫీకి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటూరు లక్ష్మయ్య, కోట్లపాటి గాంధీ నాయుడు, ఈతముక్కల వెంకటసుబ్బా నాయుడు, మునిరాజ, మునిబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులను ఆదుకుంటాం

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా పాటవాలు కలిగిన నిరుపేద విద్యార్థులను దాతల సహకారంతో ఆదుకుంటామని షిరిడిసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య హామీ ఇచ్చారు. కోటలోని సమితి కార్యాలయంలో ఆదివారం నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన నిరుపేద విద్యార్థిని తాళమాపురం నందినికి దాతల సహకారంతో రూ.50వేల విలువచేసే లాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో దాతలు రత్నం, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు, నవీన్, వెంకటేశ్వర్లు, చంద్రాచారి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థినికి లాప్‌టాప్ అందజేస్తున్న రమణయ్య తదితరులు

ఎస్కేప్ చానల్‌కు మరమ్మతులు చేయిస్తా
మత్స్యకారులకు టీడీపీ నేత దశరథరామిరెడ్డి హామీ


గోవిందపల్లి వద్ద దెబ్బతిన్న బకింగ్‌హామ్ కెనాల్ ఎస్కేప్ చానల్‌ను పరిశీలిస్తున్న దశరథరామిరెడ్డి, మత్స్యకారులు

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లి వద్ద ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ ఎస్కేప్ చానల్‌కు తన సొంత నిధులతో తాత్కలిక మరమ్మతులు చేయిస్తానని టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గోవిందపల్లిపాళెంలోని మత్స్యకారులతో కలసి దెబ్బతిన్న ఎస్కేప్ చానల్‌ను పరిశీలించారు. ఇటీవల దిత్వా తుఫాన్ కారణంగా గోవిందపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్ పొంగి రోడ్డుపై ప్రవహించడంతో రహదారి దెబ్బతింది. దారి లేకపోవడంతో గోవిందపల్లిపాళెం మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండంతో టీడీపీ నేత చిల్లకూరు దశరథరామిరెడ్డి స్పందించారు. ఎస్కేప్ చానల్ తాత్కాలిక మరమ్మతులకు సొంత నిధులు వెచ్చిస్తానని, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి హైలెవల్ వంతెన నిర్మాణానికి చర్యలు చేపడుతానని చెప్పారు.

రోడ్డును కమ్మేసిన కర్రతుమ్మ చెట్లు
వాహనదారులకు ఇబ్బందులు


వడ్డిపాళెం ప్రధాన రహదారి రోడ్డుపైకి పెరిగిపోయిన ముళ్లచెట్లు

వాకాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులను కర్రతుమ్మ చెట్లు కప్పివేస్తున్నాయి. వాకాడు నుంచి దుగరాజపట్నం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కర్రతుమ్మ చెట్లు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. దారిలో వెళ్లే వాహనదారులకు చెట్ల కొమ్మలు తగులుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో చెట్ల కొమ్మలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దారికి ఇరువైపులా చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పేదలకు ఆసరాగా ముఖ్యమంత్రి సహాయనిధి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో చికిత్స పొందిన వారికి 35మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.23.74 లక్షలు అందజేశామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గపరిధిలో రూ.4 కోట్లకు పైగా అందజేశామన్నారు. అర్హులైన పేదలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గోతులే!


వెంకటగిరి రైల్వేస్టేషన్ మార్గంలో రోడ్డుపై గోతులు

వెంకటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - నాయుడుపేట మార్గంలో రైల్వేస్టేషన్ ప్రాంతంలో రోడ్డు ఇది. దారి మొత్తం గుంతలే ఉండడంతో వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి నీళ్లు నిలవడంతో గోతులు మంరిత పెద్దగా మారాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఎమ్మెల్యే దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించండి

వన్నియకుల క్షత్రియ సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం వద్ద ఆదివారం వన్నియకుల క్షత్రియ సంఘ సమావేశం జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో వన్నెరెడ్డి కులానికి ఇచ్చిన రాజకీయ ప్రాధాన్యంపై చర్చించారు. యువగళం సందర్భంగా బండారుపల్లి, వెంకటాపురం వద్ద వన్నియకుల క్షత్రియులతో సమావేశమమైన లోకేశ్... ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు, ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, పాలకవర్గంలో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అదే విధంగా నాడు బొజ్జల సుధీర్ పార్టీ ఇన్‌చార్జి హోదాలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చేయూతనిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే తమకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ భవనానికి రెండు ఎకరాల స్థలం, అందుకు అవసరమయ్యే నిధులు ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు పేట బాలాజీ రెడ్డి, దొరైరాజురెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ యాజమాన్యం కవ్వింపు చర్యలు

గ్రామస్తుల తిరుగుబాటు



పూడి వద్ద గ్రామస్తుల ఆందోళన

కేవీబీపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి గ్రామాల్లో సాయిశక్తి సంస్థ కవ్వింపు చర్యలపై గ్రామాల్లో ప్రజలు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. ఆదివారం పూడి, ఎగువపూడి, పూడి నీకేపురం, దిగువపూడి, పోలి నాయుడుకండ్రిగలకు చెందిన ప్రజలు పూడి గ్రామంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు క్రషర్ యజమాన్యం ఏ సమయంలో వచ్చినా అడ్డుకోవడానికి సిద్ధంగా ఉండాలని తీర్మానం చేసుకున్నారు. క్రషర్ యాజమాన్యం దొంగచాటుగా యంత్రాలు తెచ్చి పనులు మొదలు పెట్టాలని పన్నాగాలు పన్నుతుండడంతో గ్రామస్తులు అడ్డుకుని వెనక్కు పంపుతున్నారు. క్రషర్ యజమాన్యానికి ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే బ్రాహ్మణపల్లి సమీపంలోని ఏజే సంస్థ ఆధ్వర్యంలో క్రషర్‌ను ప్రభుత్వం సీజ్ చేసిందని గుర్తు చేశారు.

పల్లికొండేశ్వరుడి రథోత్సవం కోసం

యుద్ధ ప్రాతిపదికన పనులు



నాగలాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వరుడి రథోత్సవం కోసం మాడ వీధుల్లో పనులు ప్రారంభించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సహాయంతో ఆలయం చుట్టూ ఉన్న కట్టడాలను తొలగించడంతో పాటు చదును చేయించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పద్మనాభరాజు మాట్లాడుతూ... మాడవీధుల్లో రథం సులువుగా వెళ్లేందుకు సిమెంటు రోడ్లు నిర్మిస్తామన్నారు.

వివాదాలపై విచారణ



విచారణ జరుపుతున్న ఏఎస్పీ, ఆర్డీవో

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం, నీర్పాకోట గ్రామస్తుల మధ్య నెలకొన్న భూ వివాదం, కేసులపై తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, సూళ్లూరు పేట ఆర్డీవో కిరణ్మయి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆదివారం విచారణ చేపట్టారు. గత వారంలో తిరుపతిలో జరిగిన ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం దళితులపై బనాయించి జైల్లో ఉంచారని, దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విచారణలో మొదటగా కేసులపై బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమపై దాడి చేసిన వారిపై కేసు పెట్టినప్పటికీ ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని గోపి విన్నవించారు. ఆధారాలిస్తే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని ఏఎస్పీ తెలిపారు. అనంతరం భూ సమస్యపై ఆర్డీవో మాట్లాడుతూ.. సర్వే నెం.87- 9లో 29సెంట్లు ప్రభుత్వ భూమి అని, ఇరువర్గాలు ప్రవేశించకూడదన్నారు. తహసీల్దార్ శ్రీదేవి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ హరిప్రసాద్, మండల సర్వేయర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీ శంకర ఆలయంలో శివుడి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మార్గశిర మాసం ఆదివారం ప్రాతఃకాల సమయంలో సదాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ అభిషేకం నిర్వహించారు. అర్చకులు శివ, సాయి ఆధ్వర్యంలో శాంతి హోమం జరిగింది. అనంతరం లింగాన్ని పూలమాలాలతో విశేషంగా అలంకరించి మంగళ హారతుల్చిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.



పుత్తూరు టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మార్గశిర మాసం మహాశివుడి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. స్థానిక భక్తుడు హరి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

అల్లాహ్ దయతో అందరూ ఆనందంగా ఉండాలి



బిర్యానీ వడ్డిస్తున్న గణేష్, మహమ్మద్ రఫీ తదితరులు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): అల్లాహ్ దయతో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహ్మద్ నబీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆనంబట్టు రోడ్డులో ఉన్న నాగూర్ ఖాదర్ వలీ దర్గాలో గంధ మహోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గణేష్, మహమ్మద్ రఫీ, బావాజీ వసీం, శంషు పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై దాడి

నారాయణవనం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు... మండలంలోని కీలగరం బీసీ కాలనీలో పేకాట ఆడుతున్న సమాచారం అందింది. సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులో తీసుకుని వారి నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మొదలైన ఏడుగంగమ్మల జాతర సందడి







గంగరాయికి పూజలు - జయరామారావు వీధిలో చాటింపు - భేరివారి మండపం వద్ద ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతర సందడి ఆదివారం మొదలైంది. 9వ తేదీ రాత్రి నుంచి 10వ తేదీ రాత్రి వరకు జరిగే ఏడుగంగమ్మల జాతర మహోత్సవానికి ఆదివారం చాటింపుతో శ్రీకారం చుట్టారు. మూడు రోజుల క్రితం నుంచి పట్టణవ్యాప్తంగా గంగమ్మలు కొలువయ్యే ప్రాంతాల్లో ఆయా కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం గంగమ్మ హద్దు రాళ్ల వద్ద ఆయా కమిటీలు వేర్వేరుగా చాటింపు నిర్వహించారు. అర్ధరాత్రిపైన కోర్టు భవనం సమీపంలో ఏడుగంగమ్మల ఆలయంలో ముక్కంటి ఆలయం తరపున లాంచనంగా జాతరకు చాటింపు జరిగింది. శ్రీకాళహస్తిలో జరిగే ఏడుగంగమ్మల జాతరకు ఎంతో వైవిష్యం ఉన్న విషయం తెలిసిందే. గంగమ్మలను ఒకే సారి కొలువుదీర్చి ఏకకాలంలో ఊరేగింపులు నిర్వహించడం ప్రత్యేకత.

చాటింపు...

పట్టణంలో బుధవారం ఏడుగంగమ్మల జాతర జరగనుంది. ఈ సందర్భంగా ఆదివారం భేరివారి మండపం వద్ద కొండమిట్టలో చాటింపు నిర్వహించారు. ముందుగా తెట్టురాయి గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను రజకులు గురవయ్య, బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నడివీధి గంగమ్మకు ధూప, దీప, నైవేద్యం సమర్పించారు. పూజల్లో గంగమ్మ కమిటీ సభ్యులు వజ్రంకిషోర్, అంజూరు రాజా, ఎస్.దుర్గాప్రసాద్, వినయ్, మెకానిక్ రెడ్డి, సుబ్బు, పవన్ రాయల్, సతీష్‌రాయల్, గ్యాస్ బాబు, చందు, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.







పెండ్లిమండపం వద్ద శివపార్వతుల కటౌట్ - భేరివారి మండపం వద్ద విద్యుత్ దీపకాంతులు

పూర్తిగా శుభ్రమయ్యేనా?



కేవీబీపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో రాయలచెరువు కట్ట తెగి నెలరోజులు దాటినా ఇంకా పంచాయతీ సిబ్బంది వీధులను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీటి కాలువల్లో సిల్ట్ పేరుకుపోయింది. దీంతో వర్షం పడినపుడు దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాల్సి ఉంది.

వరుస తుఫాన్లతో శ్రీకాళహస్తి - తడ రోడ్డు ఛిద్రం





విజయగోపాలపురం దగ్గర ఉన్న గుంత - పదవ మైలు దగ్గర దుస్థితిలో రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నెల రోజులు నుంచి వచ్చిన వరుస తుఫాన్లతో శ్రీకాళహస్తి - తడ రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణం దుర్భరంగా మారింది. సీజనల్ వర్షాలతో పాటు తుఫాన్ల కారణంగా శ్రీకాళహస్తి నుంచి ఎన్టీఆర్‌నగర్ వరకు రోడ్డు గుంతలమయమైంది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా పైపులైన్ల కోసం తీసిన గుంతలతో వాహనాలు పక్కకు వెళ్లిన సందర్భాల్లో కూరుకుపోతున్నాయి. కేటి రోడ్డులోని పదవమైలు, విజయగోపాలపురం, అరిగిలకండ్రిగ, పద్మావతిపురం, బీఎన్‌కండ్రిగ, అలత్తూరు క్రాస్ సమీపంలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

భక్తజన సంద్రం... ముక్కంటి ఆలయం



దర్శనం కోసం ఆలయంలో వేచిఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 455 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,635, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,698మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,873 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 851, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 293, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 275, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 86మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,856 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



విద్యార్థులకు సూచనలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మార్చి 16 నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా పల్లమాల, చల్లమాంబపురం ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో రవీంద్రనాథ్ ఆదివారం పరిశీలించారు. విద్యార్థి దశలో టెన్త్ కీలకమైనదని, కష్టమైన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉదయం ఒక సబ్జెక్టు సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తారని, అలాగే సెలవు రోజుల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తరగతుల నిర్వహించాలన్నారు.

హిందూ పండగలకు సెలవులెక్కడ!

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి ప్రకటించిన ఐచ్ఛిక సెలవుల్లో హిందూ పండగలు లేకపోవడం బాధాకరమని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నరక చతుర్దశి సెలవు తొలగిస్తే ప్రస్తుత పాలకులు కార్తీక పౌర్ణమిని తొలగించారన్నారు. రథసప్తమి, నాగులచవితి, వైకుంఠ ఏకాదశి, స్కందషష్టి, గీతా జయంతి, నరక చతుర్దశి, రాఖీ పౌర్ణమి, వసంత పంచమి, అట్లతద్ది, గురుపౌర్ణమి, ఏరువాక పౌర్ణమి, పరశురామ జయంతి, విశ్వకర్మ జయంతి, అక్షయతిథి నాడు సెలవు ప్రకటించాలని కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ, ప్రస్తుత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఆరోపించారు. పట్టణంలో ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ సభలో ఆయన మాట్లాడుతూ... సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. దిత్వా తుఫాన్ కారణంగా కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. బీమా, చట్టాలపై అవగాహన కల్పించారు. దారి మళ్లి నిధులను వెంటనే సంక్షేమ బోర్డుకు జమ చేయాలని కోరారు. పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి రవి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి మల్లికార్జున్, సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ల ఆత్మీయ సమావేశం




హాజరైన ఏఎంసీ చైర్మన్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆర్ఆర్ఆర్ కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఏఎంసీ చైర్మన్ రంగినేనిచెంచయ్యనాయుడు హాజరయ్యారు. రైతుల సమస్యలు, మార్కెట్ ఆధునీకరణ, పారదర్శక సేవలపై ఆయన సమావేశంలో మాట్లాడారు.

పౌర చైతన్య వేదిక సదస్సును జయప్రదం చేయండి

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆఫీసర్స్ క్లబ్ హాలులో ఈ నెల 10వ తేదీన జరిగే పౌర చైతన్య వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్, కార్యదర్శి ఏ.ఎస్.పరమేశ్వరరావు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజానికి అనుబంధంగా వేదిక పనిచేస్తుందన్నారు. సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు.

సీఎంను కలిసిన గురవారెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సూపర్‌సిక్స్ పథకాల విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై పూర్తి వివరాలను నివేదిక రూపంలో అందజేశారు.

వైసీపీ మండల అధ్యక్షుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) మండల వైసీపీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తల్లి జయమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం పుల్లారెడ్డి కండ్రిగలో ఆదివారం కర్మక్రియలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, నాయకులు విక్రుష్టారెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు మంత్రి డోలా అభినందనలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులును ఆదివారం శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శ్రీకాళహస్తి కలంకారీ వస్త్రంతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. మంత్రి చెంచయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గుడిమల్లం పరశురామేశ్వరుడికి ఆరుద్ర పూజలు

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో కొలువై ఉన్న పరశురామేశ్వరస్వామి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా ఆదివారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు చేసి అలంకరించారు. విశేష సంఖ్యలోభక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

విశ్రాంత వీడీవో కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకాల్వ గ్రామానికి చెందిన విశ్రాంత వీడీవో మునికృష్ణారెడ్డి శనివారం మృతిచెందారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు గ్రామానికి అక్కడికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమలో శ్రీధర్, యుగంధర్, ముత్తు, బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి - తిరుచానూరు మార్గంలోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విహార్ అకాడమీ ఆఫ్ డ్యాన్స్‌కు చెందిన కళాకారుల భరతనాట్య నృత్య ప్రదర్శన అలరించింది. దింతానా, పుష్పాంజలి, చిన్నచిన్న మురుగ, మూషిక వాహనం, భాగ్యదాలక్ష్మీ, ఏకదంతాయ, మాడు మీకుం కన్నె, శివతాండవం వంటి గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. శిల్పారామం ఇన్‌చార్జి ఏవో సూర్యతేజ, ఏఈ రాధాకృష్ణ కళాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు.